నమస్తే ఆంధ్ర.కాం
సకల వార్తల విందు
namastheandhra.com ...news all the way

# నాట్స్ అధ్యక్షుడిగా మాదల రవి

నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) గా ఆవిర్భవించిన అమెరికాలోని కొత్త తెలుగు సమాజం ఫ్లోరిడాలో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తానాకు దాదాపు పోటీగా జరుగుతున్న ఈ భారీ తెలుగు ఉత్సవాలకు సర్వత్రా ఆదరణ లభిస్తోంది. నాట్స్ తెలుగు సంఘానికి కొత్త అధ్యక్షుడిగా రవి మాదల నియమితులయ్యారు. అంతర్జాతీయ తెలుగు సమాజం తరఫున తెలుగు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను మరింతగా ముందుకు తీసుకెళ్లగల లక్ష్యంతో సంస్థ నూతన కార్యవర్గాన్ని భారతీయ కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 6.30 గంటలకు ప్రకటించారు.

అధ్యక్షుడిగా రవి మాదల, కార్యదర్శిగా శ్రీనివాస్ కోనేరు నియమితులయ్యారు. మిగిలిన కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు.

కార్యవర్గాన్ని ప్రకటించిన తర్వాత సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ మాట్లాడుతూ నాట్స్ ఆవిర్భావాన్ని ఇప్పటికే పలువురు పెద్దలు పలు రకాలుగా నిర్వచించారని, అలాంటిది తాను నేషనల్ అసోసియేషన్ ఫర్ తెలుగు సర్వీస్‌గా నిర్వచిస్తున్నానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మామిడి చెట్టు పెద్దదైన తర్వాత, ఫలాలు ఇస్తున్నప్పుడు దాని కొమ్మను అంటుకట్టి కొత్త మొక్కను తయారు చేస్తామని... అలాగే అమెరికాలోని తెలుగు సమాజాన్ని ప్రతిబింబించేందుకు కొత్త సంఘాల ఆవిర్భావం కూడా తప్పేమీ కాదని ఆయన అభివర్ణించారు. గతంలో తమ సాటి తెలుగు వారిని చూడాలంటే పదిమైళ్లు వెళ్లాల్సి వచ్చేదని... ఇప్పుడు మైలుకు పదిమంది తెలుగువాళ్లు ఉన్నారని అందువల్ల తెలుగువారి కోసం ఎక్కువ సంఘాలు రావడం తప్పేమీ కాదని పేర్కొన్నారు.

అనంతరం నాట్స్ ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహించారు. ఉదయభాను ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ రెండు పాటలను ఆలపించారు. 'నీ పాదం మీద పుట్టుమచ్చ నౌతా చెల్లెమ్మా', 'పెళ్లెప్పుడవుతుంది బాబూ..' అనే రెండు పాటల్ని ఆయన ఆలపించారు.

namastheandhra.com